ఈనాడు
పశ్చిమగోదావరి
మంగళవారం అక్టోబరు 1, 2024 5

మిల్లు ఎంపిక నిర్ణయం రైతులదే

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సంస్కరణలు



భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం సేకరణకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ ప్రక్రియలో గత సమస్యలను తొలగించే దిశగా కూటమి ప్రభుత్వం సంస్కరణకు శ్రీకారం చుట్టింది. గ్రామ సభలు నిర్వహించి రైతులు సూచించిన మిల్లులకే ధాన్యం తరలించే వెసులుబాటు కల్పించనున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉంటే అక్కడే ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పిస్తారు.

48 గంటల్లోనే సొమ్ము జమ.. అక్టోబరు నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఇప్పటికే అధికారులకు స్పష్టం చేశారు. రవాణాకు అవసరమయ్యే వాహనాలను సిద్ధం చేస్తున్నారు. రైతులే సొంతంగా ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే రవాణా ఛార్జీలను వారికే చెల్లించనున్నారు. ప్రధానంగా 48 గంటల్లో ధాన్యం సొమ్ము వారి ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంతో పోలిస్తే మద్దతు ధరను క్వింటాలుకు రూ.117 పెంచారు. గ్రేడ్-ఎ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చొప్పున చెల్లించనున్నారు.

ప్రత్యేక కార్యాచరణ.. కలెక్టర్, జేసీల సూచనల మేరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయడంతో పాటు రవాణాకు వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైనంత మేరకు గోనె సంచులను అందుబాటులో ఉంచుతాం. కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయింది. - **శివరామప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్**

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం వివరాలు (మెట్రిక్ టన్నుల్లో) ఇలా..

ఉత్పత్తి (అంచనా) 6.90 లక్షలు	మార్కెట్‌కు వచ్చేది 5.40 లక్షలు
రైతుల వినియోగం 69 వేలు	గుర్తించిన మిల్లులు 202

అన్ని ప్రాంతాలకూ స్వచ్ఛమైన నీరు

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



ఉప్పరగూడెం గ్రామస్థులతో మాట్లాడుతున్న నాగరాణి

మహదేవపట్నం(ఉండి), న్యూస్‌టుడే: అన్ని ప్రాంతాలకూ స్వచ్ఛమైన నీరందించాలని అధికారులను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఉండి మండలం మహదేవపట్నంలోని ఉప్పరగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు, రహదారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్‌తో మాట్లాడారు. ప్రజల నుంచి మరోసారి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు విజ్ఞప్తి మేరకు ఉప్పరగూడెం ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిసరాల శుభ్రత, పెరటి తోట నిర్వహణను పరిశీలించిన ఆమె ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ వర్మను అభినందించారు.

ఈ-పంట నమోదు పరిశీలన

పాందువ్వ, ఉప్పులూరు, మహదేవపట్నం గ్రామాల్లో ఈ-పంట నమోదు తీరును కలెక్టర్ పరిశీలించారు. మురుగు కాలువల నిర్వహణ సరిగా లేక పంటలు దెబ్బతింటున్నాయని స్థానిక రైతులు ఆమెకు చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ కేపీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై కసరత్తు



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం నూతన విధానంలో దుకాణాల కేటాయింపు, వేలం ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులపై అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, 11న వేలం ప్రక్రియ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలు గడువు సోమవారంతో ముగిసింది. కొత్తగా దుకాణాలు ఏర్పాటయ్యే వరకు పాత విధానంలోనే విక్రయాలు కొనసాగించాలని అధికారులు దుకాణాల సిబ్బందికి సూచిస్తున్నారు. ఉద్యోగ భద్రతపై హామీ ఇవ్వకపోగా ఇప్పుడు మళ్లీ విక్రయాలకు తమను ఉపయోగించడం సరికాదంటూ సిబ్బంది ఆబ్కారీ అధికారులకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కొత్త దుకాణాలు ఏర్పాటయ్యే వరకు మద్యం విక్రయాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

పింఛన్ల పంపిణీకి రూ. 96.57 కోట్లు



భీమవరం వన్‌టౌన్, కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 96.57 కోట్లు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,30,123 మంది లబ్ధిదారులకు మంగళవారం ఉదయం నుంచి వారి ఇళ్ల వద్దే సిబ్బంది నగదు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.✦ పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఉదయం పది గంటలకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు పురపాలక కమిషనర్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో పర్యవేక్షణ కేంద్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.



మొక్కవోని దీక్ష.. సత్ఫలితాల దక్షత..!


ఎండాకు తెగులు ఆశిస్తే దిగుబడిపై ప్రభావం

6లో

నీటి శుద్ధి.. గాలి మాట

నిలువెత్తు నిర్లక్ష్యానికి నిదర్శనాలు.. ఈ ట్యాంకులు

పరిశీలన



భీమవరం పైవంతెన సమీపాన ఉన్న మంచినీటి ట్యాంకు సుమారు 12 వార్డులకు తాగునీటిని అందిస్తోంది. శిథిలస్థితికి చేరి పైన మూతలు కూడా లేవు. దీన్ని ఎప్పుడు శుభ్రం చేశారో కూడా తెలియదు. 13వ ఆర్థిక సంఘం నిధులు రూ. 3.5 కోట్లు కేటాయించినా పురోగతి లేదు.

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, భీమవరం అర్బన్, నరసాపురం, వీరవాసరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో తాగునీరు పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ట్యాంకుల శుభ్రతను గాలికొదిలేశారు. తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో పలుచోట్ల నాచుపట్టి, రంగు మారి దుర్వాసన వస్తున్న జలాలు సరఫరా అవుతున్నాయి.



వీరవాసరం తూర్పుచెరువు తాగునీటి పథకం ద్వారా ఎనిమిది వేల మందికి మంచినీరు అందుతోంది. రెండేళ్ల కిందట మెట్లు మరమ్మతుకు గురవడంతో అప్పటి నుంచి శుభ్రం చేయలేదు.

పట్టింపులేని నిబంధనలు అర్బన్ ప్రాంతాల్లో అమృత్, గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి రక్షిత మంచినీటి సరఫరాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. కోట్లలో ఖర్చు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం కొంతమంది అధికారుల అలసత్వంతో అది నీరుగారిపోతోంది. తాగునీటి ట్యాంకులను 15 నుంచి 30 రోజులకోసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలి. నాచు, మట్టి, ఇసుక, చెత్త తొలగించాలి. ఎప్పుడు శుభ్రం చేశారో నల్లబల్లపై రాయాలి. కానీ అవేమీ చేయడం లేదు. కొన్నిచోట్ల శిథిలస్థితికి చేరడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత వైకాపా పాలనలో మంచినీటి ట్యాంకుల నిర్వహణను గాలికొదిలేశారు.

✦ గూట్లపాడులో ఓ వ్యక్తి తరచూ వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్లారు. మంచినీటి కలుషితంతోనే ఇలాంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెప్పారు.

✦ భీమవరం, మెంటేవారితోటలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు రంగుమారి, దుర్వాసన వస్తున్నాయి. వాటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని ఓ మహిళ వాపోయారు.



ఇరగవరం మండలం అర్జునుడి పాలెంలో తాగునీటి ట్యాంకు నాలుగువేల మందికి మంచినీటిని అందిస్తోంది. మెట్లు తుప్పు పట్టాయి. శుభ్రం చేయకపోవడంతో నీరు దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

అమృత్ నిధులు	రూ.225.88 కోట్లు	జల్‌జీవన్ మిషన్ నిధులు	రూ. 408 కోట్లు	జిల్లాలో కుళాయిలు	6.50 లక్షలు	ఓవర్ హెడ్ ట్యాంకులు	2200

దసరాలో పేదలకు పప్పన్నం!

- చౌక సరకుల్లో ఈ నెల కందిపప్పు పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు 359 టన్నులు మంజూరు

పాలకొల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రావడంతోనే చౌక దుకాణాల ద్వారా పేదలకు అందించే సరకులను ఒక్కొక్కటిగా పెంచుతూ వస్తోంది. గత నెల నుంచి పంచదార పంపిణీ ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ ఈ నెల నుంచి నెమ్మదిగా కంది పప్పును ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. అయిదేళ్ల వైకాపా పాలనలో కేవలం చౌక బియ్యం అది కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవి తప్ప, ఒక్క సరకు ఇచ్చిన పాపాన పోలేదు. నింగినంటుతున్న నిత్యావసర ధరల్లో కందిపప్పు ప్రథమ స్థానంలో కొనసాగుతున్నందున దాని పంపిణీ పేద కుటుంబాలకు ఊరటగా నిలిచింది. ఈ నెల 3 నుంచి దసరా నవరాత్రుళ్లు ప్రారంభమవుతున్న తరుణంలో పేదింట్లో పప్పన్నం సిద్ధమవుతోంది.



రూ. 4 కోట్లు లబ్ధి.. వాస్తవానికి కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో రూ.170 పలుకుతోంది. చౌక దుకాణాల్లో ఈ ధర రూ.67గా ఉంది. ఈ నెల 359 టన్నులు పంపిణీ చేస్తున్నందున కార్డుకు రూ. 93 లబ్ధి చేకూరనుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్డుల మీద రూ. 3,99,77,000 లబ్ధి కలుగుతుంది.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
మొత్తం కార్డులు	6,31,044	5,67,651
ఎండీయూ వాహనాలు	395	360
మంజూరైన కందిపప్పు (టన్నుల్లో)	189	170

30 శాతంతో మొదలు.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,98,695 బియ్యం కార్డులుండగా మొత్తం అందరికీ కిలో చొప్పున కందిపప్పు ఇవ్వాలంటే నెలనెలా 1,198 టన్నులు అవసరమవుతుంది. ఇప్పటివరకు కందిపప్పునకు ఉన్న డిమాండ్‌తో గత ప్రభుత్వం మొత్తం సరఫరా నిలిపేసింది. నెమ్మదిగా పంపిణీని మళ్లీ గాడిలో పెట్టాలనుకుంటున్న కూటమి ప్రభుత్వం ఈ నెల 30శాతం కార్డులకైనా కందిపప్పు ఇవ్వాలని నిర్ణయించింది. అందుబాటులో ఉన్నమేరకు ఉమ్మడి జిల్లాకు 359 టన్నులు సరఫరా చేసింది. నేటి నుంచి కార్డుదారుల్లో నిరు పేదలకు పంపిణీ చేయాలని భావిస్తుంది.

విద్యార్థి భవితవ్యానికి అపార్



ఈనాడు డిజిటల్, భీమవరం, అత్తిలి, న్యూస్‌టుడే : అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు కార్డులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించడంతో జిల్లాలో సోమవారం నుంచి ప్రక్రియ మొదలుపెట్టారు. అక్టోబరు 14 వరకే సమయం ఉండటంతో తల్లిదండ్రులకు అనుమతి పత్రం ఇచ్చి, దానివల్ల కలిగే ఉపయోగాలను విద్యాశాఖ అధికారులు వివరిస్తున్నారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ దీనికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి, తదనుగుణంగా వారి సమాచారం నిక్షిప్తం చేస్తారు. ముందుగా 9, 10 తరగతి విద్యార్థులకు తర్వాత కేజీ నుంచి పీజీ వరకు పూర్తి చేయనున్నారు.

ప్రయోజనం ఇలా.. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. ఆన్‌లైన్‌లో నంబరు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కేజీ టు పీజీ సమాచారం మొత్తం తెలుస్తుంది. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకాడమీ), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో కీలకమవడంతో వాటన్నింటినీ ప్రామాణికంగా తీసుకుంటున్నారని డీఈవో నాగమణి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు	3,179
ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు	2.56 లక్షలు
ప్రైవేటు పాఠశాలలు	4,250
విద్యార్థులు	5.20 లక్షలు

మూగజీవాలతో చీకటి దందా

యథేచ్ఛగా అక్రమ రవాణా | సంతల్లో గుట్టుగా క్రయ విక్రయాలు | సరిహద్దులు దాటించి విదేశాలకు మాంసం ఎగుమతి | నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

ఉమ్మడి జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంతల ముసుగులో గుట్టుగా వేలాది ఆవులు, గేదెలను కబేళాలకు తరలించేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. వాటి మాంసం వివిధ దేశాలకు ఎగుమతి చేస్తూ మూగజీవులతో చీకటి వ్యాపారం చేస్తున్నారు. నిరోధించాల్సిన పోలీసులు, అధికారులు ముడుపుల మత్తులో మిన్నకుంటున్నారు.



➠ పాలకొల్లు, పెంటపాడు పశువుల సంత ముసుగులో యథేచ్ఛగా పశువుల రవాణా జరుగుతోంది. తాడేపల్లిగూడెం, భీమవరం, కలిదిండి గుడివాడ మీదుగా విజయవాడ తరలిస్తున్నారు. అక్కడి నుంచి మెదక్, వరంగల్, హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారు. అక్కడ మాంసం ప్యాకింగ్ చేసి ఇతర దేశాలకు తరలిస్తున్నారు.

ఈనాడు, భీమవరం, న్యూస్‌టుడే- జంగారెడ్డిగూడెం పట్టణం, నూజివీడు పట్టణం

➠ కొద్ది రోజుల క్రితం హనుమాన్ జంక్షన్ నుంచి ఆవుల రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. భారీ కంటైనర్‌లో 50 ఆవులను హైదరాబాద్ తీసుకువెళుతుండగా నూజివీడు మండలం తుక్కులూరు సమీపంలో గుర్తించారు. ఈ మార్గంలో నిత్యం ఇబ్రహీంపట్నం మీదుగా భారీగా పశువులను హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు.



ఇవి జంగారెడ్డిగూడెం సంత నుంచి కబేళాలకు తరలిస్తున్న పశువులు. ప్రతి వారం జరిగే సంతలో తక్కువ రేటుకు కొని ఇలా వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్ తరలిస్తున్నారు. ఒక్కో వాహనంలో దాదాపు 20 వరకు పశువులను అడ్డదిడ్డంగా ఎక్కిస్తారు. అధికారుల కనుసన్నల్లోనే ఇది జరుగుతోంది. కొందరు ముఠాగా ఏర్పడి అధికారులకు ముడుపులిచ్చి వీటిని తరలిస్తున్నారు. చెక్ పోస్టుల్లో సైతం తనిఖీలు చేయకుండా అధికారులకు ముడుపులు ముట్టజెబుతున్నారు.

సంతలో సదేమియా.. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఎద్దులు, ఆవుల కలిపి 1.90 లక్షల వరకు ఉన్నాయి. గేదెలు 6.12 లక్షలు ఉన్నాయి. వీటిలో ఏటా 10 శాతం వరకు వట్టిపోతాయి. మరికొన్ని అనారోగ్యం పాలవుతాయి. వీటిని కొందరు వ్యాపారులు రాజకీయ అండతో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెండు జిల్లాల్లో జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెంటపాడు, పాలకొల్లులో వారానికి ఒకసారి జరిగే సంతల ముసుగులోనే కొందరు వ్యవహారం నడిపిస్తున్నారు. దళారుల సహకారంతో పశువులను హైదరాబాద్, మెదక్, వరంగల్, కోదాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు గుట్టుగా రవాణా చేస్తున్నారు. అక్కడి కబేళాల్లో విక్రయిస్తున్నారు. మాంసాన్ని ప్యాకింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

జేబులు నింపుకొంటున్నారు.. 1960 జంతు పరిరక్షణ చట్టం ప్రకారం పశువులను వధించడం చట్టరీత్యా నేరం. అయినా వ్యాపారం జోరుగా సాగుతోంది. వట్టిపోయిన పశువులను రైతుల నుంచి రూ. 5-10వేల మధ్య దళారులు కొనుగోలు చేస్తున్నారు. వారు మాత్రం రూ. 15-20వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పశువుల మాంసమే కాదు చర్మం, కొమ్ములు, ఎముకలు ఇలా అన్నీ ఉపయోగపడతాయి. చెప్పులు, వాయిద్య పరికరాలు, ఎరువుల తయారీలో వినియోగిస్తారు. దీంతో భారీ డిమాండ్ ఉంది.

కళ్లు మూసుకున్నారు.. ఈ విక్రయాలు, రవాణా జరగకుండా చూడాల్సిన పశుసంవర్ధక, పోలీస్, మార్కెటింగ్ శాఖలు కళ్లు మూసుకున్నాయి. సంతల్లో విక్రయాలు జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోరు. దారిలో రవాణా చేస్తున్నా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులున్నా లేనట్టే ముడుపులిచ్చి కథ నడిపిస్తున్నారు. నూజివీడులో ఓ వైకాపా నాయకుడి ఆధ్వర్యంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. అతనే కొందరు దళారులతో జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాలనుంచి పశువులను రవాణా చేస్తున్నారు. ఈ అంశమై మార్కెటింగ్ ఏడీ మహేంద్రనాథ్‌ను వివరణ కోరగా ..తన దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: టెట్ నిర్వహణ ఏర్పాట్లపై డీఆర్వో ఉదయభాస్కరరావు సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ పరీక్షలు నిర్వహించే మూడు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

చక్రాలపై అంతరిక్షం

రోడ్డెక్కిన కాల్‌మనీ బాధితులు

6లో

మీ కోసంలో 164 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు బాధ్యతగా పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'మీ కోసం'లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 164 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. డీఆర్వో ఉదయభాస్కరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.✦ ఉమ్మడి మంచినీటి చెరువును కొందరు ఆక్రమించి పూడ్చి వేశారంటూ భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన కనుమూరి రఘుపతిరాజు, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. శివారు గ్రామం కావడంతో కాలువ నీరు సక్రమంగా రావడం లేదని పేర్కొన్నారు. ✦ నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తదితరులు అర్జీ ఇచ్చారు.

పోలీసు శాఖకు 16 అర్జీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'మీ కోసం'లో అందిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 16 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిలో ఆస్తి తగాదాలు, సరిహద్దు వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై పోలీస్‌స్టేషన్ల వారీగా పర్యవేక్షణ ఉంటుందన్నారు.

పాఠశాల సముదాయాల కుదింపు

పునర్ వ్యవస్థీకరణకు కసరత్తు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ విద్యా విధానంలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాఠశాల సముదాయాల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియకు కసరత్తు మొదలైంది. జిల్లాలో ప్రస్తుతం 113 పాఠశాల సముదాయాలు ఉన్నాయి. వాటి సంఖ్య కొంత మేర తగ్గనుంది. మరో రెండు మండలాల వివరాలు సేకరించాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెప్పారు. దాదాపు 24 సముదాయాలు తగ్గే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు.

యథావిధిగా సీఆర్పీలు.. క్లస్టర్ ప్రాతిపదికన బీఈడీ విద్యార్హతతో రోస్టర్ విధానంలో ఉద్యోగాలు సాధించిన సీఆర్‌ఎంటీలు గత కొన్నేళ్లుగా పాఠశాల సముదాయాల పరిధిలో సీఆర్పీలుగా పనిచేస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే అక్కడ పాఠాలు చెప్పేందుకు సీఆర్పీలు వెళ్తారు. మిగిలిన రోజుల్లో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తారు. జిల్లాలో 150 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా సీఆర్పీలుగా 89మంది పనిచేస్తున్నారు. పాఠశాల సముదాయాలను కుదించినా జిల్లాలో సీఆర్పీల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి జిల్లాలో సర్వే కొనసాగుతోందని డీఈవో జి.నాగమణి చెప్పారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

తిరుమల పవిత్రతను కాపాడండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్తు నాయకుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. తిరుమల పవిత్రతను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధులు, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల సుభాష్, కోమటి రవికుమార్, భీమవరం నియోజకవర్గ కన్వీనర్ కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చక్రాలపై అంతరిక్షం

ఏలూరు విద్యా విభాగం, నగరం, న్యూస్‌టుడే: నేటి ఆధునిక సమాజ ఆవిర్భావం వెనుక శాస్త్రీయ విజ్ఞానం దాగుంది. శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి సాంకేతికతకు దర్పం పట్టేలా కొత్త విషయాలు కనుగొంటారు. అటువంటి ప్రయోగాలకు వేదికైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థను (ఇస్రో) సందర్శించే అవకాశం కొందరికే లభిస్తూ ఉంటుంది. ప్రత్యక్షంగా సందర్శించే అవకాశం లేని వారికి సైన్స్ పరిశోధనలు, రాకెట్ల నమూనాలను చూపించాలనే సంకల్పంతో ఇస్రో నిర్వాహకులు ఒక చక్కని అవకాశాన్ని కల్పించారు. వీలైనంత ఎక్కువ మంది చూసేందుకు వీలుగా 'స్పేస్ ఆన్ వీల్స్' పేరిట ప్రత్యేకంగా బస్సును రూపొందించి దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఆ బస్సు సోమవారం ఏలూరులోని సీఆర్ఆర్ పాఠశాలకు వచ్చింది. చంద్రయాన్ 1, 2, 3 ప్రయోగాలు, మిషన్, మంగల్యాన్, ఆదిత్య ఎల్1 మిషన్, శ్రీహరి కోటలోని శాటిలైట్ లాంచ్ ప్యాడ్, ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం, వాతావరణ మార్పులు, తుపాన్లు తదితర ప్రకృతి వైపరీత్యాల గురించి ముందుగానే తెలుసుకునే రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ సిస్టం, టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ, వివిధ ఉపగ్రహాలు. వీటి ప్రత్యేకతల గురించి విద్యార్థులకు వాలంటీర్లు వివరించారు.



బస్సులో అంతరిక్ష సంగతులు



నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు

3,394 మంది వీక్షణ

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఏలూరు డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 3,394 మంది విద్యార్థులు అంతరిక్ష మహాయాత్ర బస్సును సందర్శించారు. భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల సమాచారంతో కూడిన 108 చార్టులు ప్రదర్శించారు. విద్యార్థులకు రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వరద బాధితులకు చేయూత

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ఏపీ ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు రూ. 7,00,835 లక్షల చెక్కును కలెక్టర్ నాగరాణికి సోమవారం అందజేశారు. డీఈవో నారాయణ పాల్గొన్నారు. ● వెంప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ. 26,113 ని వీరవాసరం విద్యాశాఖాధికారికి అందించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్ఎస్ భవానీరాజు తదితరులు పాల్గొన్నారు. ● భారతీయ విద్యాభవన్స్ విద్యార్థిని దండు వేదిత రూ. 17,852 చెక్కును కలెక్టరుకు అందజేశారు.



కలెక్టర్ నాగరాణికి చెక్కు అందిస్తున్న ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం ప్రతినిధులు


ఉపాధ్యాయ సమస్యలపై వినతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 2న పురపాలక సంఘాల్లో, 17న డీఈవో కార్యాలయం వద్ద దీక్షలు, 24న డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు చెప్పారు.



కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించాలి: వీసీ



మాట్లాడుతున్న గోపాల్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 'బోధన అభ్యాసం వనరులు', 'పరిశోధన వృత్తిపరమైన అభ్యాసాలు', 'ఫలితాలు', 'సమ్మిళిత', 'అవగాహన' వంటి ఐదు అంశాలు ప్రామాణికంగా తీసుకుని ఉద్యాన విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని ఉపకులపతి కె.గోపాల్ సూచించారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వరంగల్ నిట్ కేంద్ర గ్రంథాలయాల మాజీ గ్రంథపాలకుడు వీరాంజనేయులు ఎన్ఐఆర్ఎఫ్, ఎన్ఐఆర్ఎఫ్‌లో కేటగిరీలు, కొలమానాలు, మూల్యాంకన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎమ్మెల్యే

ఎస్సై కుర్చీలో కూర్చొని పోలీసులకు సూచనలివ్వడంపై విమర్శలు



కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా పోలీసులు కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. తడికలపూడి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పలువురు బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని పోలీసులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ సందర్శన నేపథ్యంలో ఎమ్మెల్యే...ఎస్సై గదిలో ఆయన కుర్చీలో కూర్చోవడం చర్చనీయాంశమైంది. బాధితులు కూర్చొన్న వరుసలోని మరో కుర్చీలో ఎస్సై చెన్నారావు కూర్చొని ఎమ్మెల్యే మాటలు ఆలకిస్తున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

ఇష్టానుసారంగా రుణాలిచ్చారు..

మొగల్తూరు మహాజన సభలో అధికారులను నిలదీసిన రైతులు

నరసాపురం, న్యూస్‌టుడే: సొసైటీల్లో రుణాలివ్వడమే గాని రికవరీ లేదు, రైతుల సొమ్ము ఇష్టానుసారం కొంతమందికే ముట్టజెప్పారంటూ మొగల్తూరు సొసైటీ మహాజన సభలో కొందరు రైతులు అధికారులను నిలదీశారు. దీంతో అజెండాలోని అంశాలు చర్చించకుండానే మమ అనిపించారు. మొగల్తూరు సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకాధికారి ఎస్. నరేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభ గందరగోళంగా మారింది. మొగల్తూరు సొసైటీలో గత అధ్యక్షుడు మోటుపల్లి రామభాస్కరరావు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తీసుకున్న రుణాలు ఇప్పటికే రూ. 1.67 కోట్ల ఉన్నాయని, సక్రమంగా చెల్లించకపోయినా ఎలా పునరుద్ధరించారని రైతు కత్తుల సత్తిబాబు, పలువురు అధికారులను ప్రశ్నించారు. ఆయా రుణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరింత అవినీతి బయటపడుతుందని డిమాండ్ చేశారు. దానిపై కొందరు రైతులు కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారు. అధికారులు సర్దిచెప్పడంతో వెనుతిరిగారు. అనంతరం ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు తీసుకున్న రుణాలు, చెల్లింపులు, గత ఆర్థిక సంవత్సరంలో సంఘం ఆర్జించిన లాభం తదితర అంశాలను సీఈవో గోవిందరాజు చదివి వినిపించారు. పువ్వాడ శేషగిరి, అర్కప్రసాద్ శ్రీనివాస్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

2న ఏపీటీఎఫ్ అధ్యయన తరగతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) జిల్లా స్థాయి అధ్యయన తరగతులు ఈ నెల 2న తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు- విద్యారంగంపై ప్రభావం, విద్యారంగ సమస్యలు అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

రైతేరాజు

మొక్కవోని దీక్ష.. సత్ఫలితాల దక్షత..!




డ్రాగన్ తోట

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే

ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారు కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన రైతు పోతన శేషగిరిరావు. ఎనభై పదుల వయస్సులోనూ లాభాలు పండిస్తూ.. తోటి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శేషగిరిరావుది వ్యవసాయ కుటుంబం. ఇరిగేషన్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసి 1999లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం స్వగ్రామానికి వచ్చేసిన ఆయన తనకున్న సుమారు 15 ఎకరాల పొలంలో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో వంటి తోటలు వేసి, ఇరవై ఏళ్లుగా సాగుచేస్తున్నారు. సాగు సమయంలో పొలం మధ్యలో నుంచి హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లడంతో కొన్ని ఆయిల్‌పామ్, కొబ్బరి చెట్లను తొలగించాల్సి వచ్చింది. అనంతరం వాటి స్థానంలో కొత్త రకం పంటలను సాగు చేయాలని ఆలోచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా డ్రాగన్ ఫ్రూట్ గురించి తెలుసుకున్నారు. 2021లో కోల్‌కతా నుంచి ఒక్కో మొక్క రూ.60 చొప్పున ఆరు వేల మొక్కలు తెప్పించి మూడెకరాల విస్తీర్ణంలో నాటారు. రెండేళ్ల నుంచి పంట కాపునకు రాగా ఎకరాకు టన్ను ఫలసాయం అందుతోంది. కిలో రూ.100 నుంచి 150 కి అమ్ముతున్నారు. ఎకరాకు స్తంభాలు, గట్లు, డ్రిప్, మొక్కలు తదితరాలకు రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చు అవుతుంది. దీర్ఘకాలిక పంట కావడంతో ప్రారంభ సమయంలోనే పెట్టుబడి అవుతుందని, అనంతరం నిర్వహణ, కూలీల ఖర్చులు తప్ప పెద్ద వ్యయం ఉండదని రైతు చెబుతున్నారు. అయితే వయస్సు మీద పడటంతో కొద్ది నెలలుగా డ్రాగన్ సాగులో తన అల్లుడు సత్యజానకీరాం సాయం తీసుకుని ముందుకు సాగుతున్నారు. వాడాల్సిన ఎరువులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై నిరంతరం వారికి అవగాహన కల్పిస్తూ బయ్యనగూడెంలో పదెకరాలు, కేతవరం గ్రామంలో మూడెకరాల్లో ప్రస్తుతం ఆయన సాగు చేస్తున్నారు. వీటితో పాటు గతంలో బొబ్బాయి, పుచ్చకాయ, క్యారెట్, ఇతర పంటలను సైతం సాగుచేసి సత్ఫలితాలు సాధించారు.

సేంద్రియ పద్ధతుల్లో...



'వ్యవసాయం అంటే ఇష్టంతోనే ఉద్యోగం విరమణ అనంతరం పొలం బాట పట్టాను. రకరకాల పంటలను సాగు చేశా. అన్నింటిలోనూ మంచి లాభాలే వచ్చాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను మొదటి సారిగా ఈ ప్రాంతానికి తీసుకొచ్చా. దీనిని సేంద్రియ పద్ధతుల్లో పెంచుతున్నాం. పశువుల ఎరువు, జీవామృతం, ఇతర సేంద్రియ పోషకాలను ఎరువుగా అందిస్తున్నాం. ఎకరాకు ఖర్చులు పోనూ రూ.40 నుంచి 50 వేలు ఆదాయం వస్తుంది' అని పోతన శేషగిరిరావు తెలిపారు.

మీరూ అడగొచ్చు

ప్రశ్న: బెండలో కాయ తొలుచు పురుగును ఎలా అరికట్టాలి ?

- రాజారావు, టి.నరసాపురం

సమాధానం: కాయ తొలుచు పురుగు విత్తిన 30 రోజుల నుంచి కోత దశ వరకు ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, పూత, కాత దశలో కాయలను తొలిచి నష్టం కలిగిస్తోంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను ఒక అంగుళం కిందకి తుంచి నాశనం చేయాలి. లీటరు నీటికి క్వినాల్‌ఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి. పంట కాపునకు రాని దశల్లో థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

✆ చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ఎండాకు తెగులు ఆశిస్తే దిగుబడిపై ప్రభావం

మార్టేరు, న్యూస్‌టుడే: సార్వా వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు సమస్యాత్మకమైంది. వాతావరణ మార్పుల కారణంగా ప్రస్తుతం అధిక విస్తీర్ణంలో సాగైన ఎంటీయూ 1318, పీఆర్ 126 వరి రకాల్లో ఈ తెగులు కనిపిస్తుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త వి. భువనేశ్వరి తెలిపారు. ప్రస్తుతం పిలక దశ నుంచి అంకురం దశ వరకు ఉన్న పొలాలను పరిశీలించగా ఈ తెగులు గుర్తించడం జరిగింది. పంటను ఈ తెగులు ఆశిస్తే ఆకులు ఎండిపోవడం, గింజలు తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుంది. సాగునీటి ప్రవాహం, గాలితో కూడిన వర్షంతో ఈ తెగులు ఇతర పొలాలకు వ్యాపిస్తుంది. తెగులు గుర్తించిన వెంటనే నత్రజని ఎరువును వేయడం ఆపి దఫా దఫాలుగా కొద్ది మోతాదు వేసుకోవాలి. పొలంలో ఉన్న నీటిని తీసి కొత్త నీటిని పెట్టుకోవాలి. తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, లేదంటే టెట్రా సైక్లిన్ హైడ్రోక్లోరైడ్ 1.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరం మేరకు 15 రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



తెగులుతో ఎండిపోయిన వరి పంట

ఆక్వా సాగులో నీటి నాణ్యత తప్పనిసరి

నరసాపురం, న్యూస్‌టుడే: ఆక్వా సాగు చేసే చెరువుల్లో నీటి నాణ్యత లోపిస్తే మత్స్య సంపద మృత్యువాత పడుతుందని ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు తెలిపారు. ఆక్వా సాగులో అత్యధికంగా మురుగు కాలువలు, ఉప్పుటేరుల నీటిని వినియోగించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఆక్వా చెరువుల్లో నీటిని శుద్ధి చేయకుండా నేరుగా కాలువల్లోకి వదలడంతో అవి కలుషితమవుతున్నాయి. వాటిలోని నీటినే నేరుగా రొయ్యలు, చేపల చెరువుల్లోకి నింపడంతో వాటికి వ్యాధులు సోకి నష్టపోవాల్సి వస్తోంది. పలువురు రైతులు వ్యాధుల భయంతో కాలువల్లో నీటిని నెలల తరబడి చెరువుల్లోకి తోడటం లేదు. దీంతో వాటిల్లోని మత్స్య సంపదకు ఆక్సిజన్ సక్రమంగా అందక ఎదుగుదల లోపించడం, చనిపోవడం చోటుచేసుకుంటాయి. ఆక్వా చెరువుల్లోకి నీటిని తోడుకునేందుకు వీలుగా ఒక చెరువును కేటాయించాలి. అందులో నీటిని శుద్ధిచేసి వాటిని సాగు చెరువుల్లోకి నింపాలి. వినియోగించిన నీటిని శుద్ధిచేసిన అనంతరం బయటకు వదలాలి. వ్యాధులతో మృతిచెందిన చేపలు, రొయ్యలను కాలువల్లోకి వేయకుండా గొయ్యి తీసి పూడ్చాలి. ఆక్వాచెరువుల నీటిలో అమ్మోనియా, నైట్రైట్, హెచ్‌టుఎస్ వంటి విషవాయువులు నిర్ధారణకు తరచూ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలని గోపాలరావు రైతులకు సూచించారు.



రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సంస్థ సేవలను మరింత విస్తరించేలా కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. వివిధ శాఖల అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో భీమవరం, నరసాపురం, తణుకులలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తనిధి కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించి 2022-23లో నాటి కలెక్టర్ ప్రశాంతి గవర్నర్ నుంచి పురస్కారం అందుకున్నారని.. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

వీఆర్‌ఏలకు న్యాయం చేయండి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలంటూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాత్రి కాపలాదారు, సహాయకులు, చోదకులు, రికార్డు అసిస్టెంట్ కొలువులను అర్హత ఉన్నవారికి ఇవ్వాలని కోరారు. పదోన్నతులు, పేస్కేలు విషయంలో న్యాయం చేయాలని విన్నవించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గణేశ్వరరావు, డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయం వద్దకు వచ్చిన బాధితులు

రోడ్డెక్కిన కాల్‌మనీ బాధితులు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: సంవత్సరాల తరబడి అధిక వడ్డీలు కట్టలేక మరో పక్క వడ్డీ వ్యాపారుల మానసిక, లైంగిక వేధింపులు తట్టుకోలేక పలువురు కాల్‌మనీ బాధితులు రోడ్డెక్కారు. సోమవారం నగరంలోని ఎస్పీ కార్యాలయానికి ప్రదర్శనగా వచ్చి ఫిర్యాదులు అందజేసి న్యాయం చేయాలని విన్నవించారు. బాధితులకు బాసటగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఎస్పీ కార్యాలయానికి వచ్చి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కరోనా సమయంలో రూ.50 వేలు తీసుకున్నామని.. ఇప్పటికి రూ.10 లక్షలు కట్టామని అయినా అప్పు తీరలేదని అంటున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఓ వ్యాపారి వడ్డీ కోసం ఇంటికొచ్చి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని మరో మహిళ ఆరోపించింది. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కేవీపీఎస్ సమావేశం అడ్డగింత

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రౌండ్ టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్, కార్యదర్శి ఆంజనేయులుతో చర్చలు జరిపిన అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. క్రాంతిబాబు మాట్లాడుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించకుండా అడ్డుకోవడం, నాయకులను నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నా అడ్డుకోవడం లేదన్నారు. ★ రౌండ్ టేబుల్ సమావేశం జరగకుండా పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటని వ్యకాసం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఓ ప్రకటనలో విమర్శించారు.

ఎస్పీకి వినతి.. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలంటూ దళిత, ప్రజా సంఘాల నాయకులు ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.



క్రాంతిబాబుతో చర్చిస్తున్న పోలీసు

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.08 లక్షలు తీసుకుని మోసగించినట్లు బాధిత మహిళ నుంచి అందిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. హైదరాబాద్‌లో ఉంటున్న పి. కృష్ణమోహన్ సామాజిక మాధ్యమాల ద్వారా మాట్లాడుతూ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రెండు దఫాలుగా నగదు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంపై ప్రశ్నించినందుకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

విదేశీ కరెన్సీ విక్రయం పేరుతో రూ.2 లక్షలు లూటీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: విదేశీ కరెన్సీ నోట్లు విక్రయిస్తామని చెప్పి ఒక వ్యక్తి నుంచి రూ.2లక్షలు లూటీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేశామని ఏఎస్సై యు.రాజేంద్ర తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు విదేశాల నుంచి వచ్చిన వారినుంచి కరెన్సీ, సామగ్రి కొనుగోలు, విక్రయ వ్యాపారం నిర్వహిస్తారు. గత నెల 29న గుర్తుతెలియని వ్యక్తులు రామచంద్రరావు చరవాణికి ఫోన్‌చేసి తమ వద్ద విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయని నమ్మబలికారు. దీంతో ఆయన తన వెంట రూ.2 లక్షలు తీసుకుని వారు తెలియజేసిన ప్రాంతానికి సోమవారం ఉదయం వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారామపురం-రాజుగారితోట మార్గంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు రామచంద్రరావుపై దాడిచేశారు. అతని వద్ద నుంచి రూ.2 లక్షలు లాక్కుని ఉడాయించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన జి. అరుణకుమార్, వై.కృష్ణవంశీలు కొద్ది కాలం నుంచి విశాఖ మన్యం నుంచి గంజాయి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ నాగరాజు, సిబ్బంది సోమవారం తనిఖీలు చేయగా వారిద్దరితో పాటు కొనుగోలు చేస్తున్న మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 కిలోల గంజాయి, రూ. 30 వేల విలువైన 4 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry ★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పైII తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

• భీమవరం • ఉండి

గాంధీ వేషధారణలతో నేడు ప్రదర్శన

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకొని జాతిపిత వేషధారణ చేసిన 156 మంది విద్యార్థులతో సోమవారం శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు భీమవరం లోని క్విట్ ఇండియా స్తూపం నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం వద్ద బుధవారం శాఖాహార చైతన్య ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ. ప్రసాద్ తెలిపారు.

సహాయ ప్రణాళిక అధికారిగా శ్రీలక్ష్మి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక సహాయ ప్రణాళిక అధికారిగా ఎం.శ్రీలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె జీవీఎంసీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నేడు బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం

గునుపూడి, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డీఈ ఎస్‌వీపీ కమలాకర్ తెలిపారు. వినియోగదారులకు అందిస్తున్న వివిధ సేవలను తెలియజేసేలా సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

శివయ్యకు పంచామృతాభిషేకాలు



భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భాద్రప్రద మాస శివ రాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వ రజనార్దనస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామిని వివిధ రకాల పుష్పాలు, దీపాలతో నేత్రపర్వంగా అలంకరించి సహస్ర నామ పూజలు చేశారు. పార్వతీ దేవి, అన్నపూర్ణమ్మవార్లకు సహస్ర నామ కుంకుమార్చనలను ప్రధానార్చకులు రామకృష్ణ, సోంబాబు పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ధర్నా

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలో సర్వే సంఖ్య 606లో ఆక్రమణలు తొలగించాలంటూ ఏపీ జనప్రగతి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకరరావు 'మీ కోసం' కార్యక్రమంలో తహసీల్దారు కార్యాలయ అధికారులకు సోమవారం అర్జీ అందజేశారు.


భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	------
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	సరిపోదా శనివారం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	------
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	------
విజయలక్ష్మి స్క్రీన్ 1	కళింగ

ఆటకు.. లేదు చోటు!

అధ్వానంగా క్రీడా మైదానాలు



గూట్లపాడు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మాణ సామగ్రి

భీమవరం గ్రామీణ, వీరవాసరం, న్యూస్‌టుడే: చిన్నారుల సమగ్ర వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయి. అందుకే పాఠశాలల్లో చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కానీ క్షేత్ర స్థాయిలో అధికశాతం పాఠశాలలకు మైదానాలు లేవు.. ఉన్న చోట కూడా క్రీడా సాధనకు ఏమాత్రం అనువుగా లేవు. దీంతో చిన్నారులు ఆటలకు దూరమవుతున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను అనాకోడేరు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. అక్కడ వసతులు అంతంత మాత్రంగానే ఉండటంతో పోటీల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యాయి.

నియోజకవర్గంలో ఇలా..

● భీమవరం మండలంలో 12 జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా రెండు చోట్ల మినహా ఎక్కడా సరైన మైదానాలు లేవు. తుందుర్రు ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షం వస్తే చెరువులా మారిపోతుంది. గూట్లపాడులోనూ అదే పరిస్థితి. చినఅమిరం, కొవ్వాడ, దిర్సుమర్రు, గొల్లవానితిప్ప పాఠశాలల పరిస్థితి మరింత దారుణం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఆటలు ఆడే స్థలం కనిపించదు. ఎంపీపీ పాఠశాలలు 62 ఉండగా ఒక్క చోట కూడా ఆటలకు అవకాశం లేదు. తీర ప్రాంతమైన దొంగపిండి పాఠశాల విద్యార్థులు గతంలో క్రీడల్లో బాగా రాణించేవారు. అయిదేళ్లుగా అక్కడ పీఈటీ లేరు.



వర్షం వస్తే ఇలా..

● వీరవాసరం మండలంలో 63 ఎంపీపీ పాఠశాలలుండా ఒక్క చోట మాత్రమే ఆట స్థలం ఉంది. ఉన్నత పాఠశాలలు ఏడు ఉండగా తోలేరు, మత్స్యపురి, రాయకుదురులలో మైదానాలున్నా ఆటలకు అనువుగా లేవు. అండలూరు, దూసనపూడి పాఠశాలల్లో అసలు మైదానాలే లేవు. మొత్తం 19 ఉన్నత పాఠశాలలుండగా 11 చోట్ల వ్యాయామ ఉపాధ్యాయులు లేరు.

ప్రతిపాదనలు పంపుతాం: పీఈటీ కొలువులు త్వరలోనే భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో క్రీడా మైదానాలు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపనున్నాం.

- ఎన్.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీవైఈవో

ఆకివీడు, న్యూస్‌టుడే

సమస్య: ఆకివీడు పట్టణ ఆనాల చెరువు గట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పక్కన రహదారి వెంబడి మూడు విద్యుత్తు పరివర్తకాలు దిగువకు ఉన్నాయి. వాటిచుట్టూ పిచ్చిమొక్కలు, పాదులు దట్టంగా పెరిగిపోయాయి. పెద్దింట్లమ్మ గుడి వీధిలో విద్యుత్తు స్తంభాన్ని పాదులు అల్లుకుపోయాయి. - స్థానికులు

సమాధానం: ఆయా ప్రాంతాలను పరిశీలించి పాదుల తొలగింపు పనులు చేయిస్తాం. - ప్రదీప్, విద్యుత్తు ఏఈ

వరద బాధితులకు భరోసా



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కాళింగగూడెం (ఆకివీడు), న్యూస్‌టుడే: కొల్లేరు వరద ప్రభావంతో నష్టపోయిన వరి రైతులకు ప్రభుత్వం శరవేగంగా నష్ట పరిహారం అందించిన ఎంతో భరోసా కల్పించిందని పలువురు రైతులు, నాయకులు తెలిపారు. తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కాళింగగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం చేశారు.

ప్రజా సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా..!

అధికారుల తీరుపై కౌన్సిలర్ల అసహనం



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పట్టణ పరిధిలో ప్రజా సమస్యలను పాలకమండలి సమావేశం దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆకివీడు నగర పంచాయతీ పాలకమండలి సమావేశం ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఫిల్టర్‌బెడ్లలో ఇసుక మార్చిడి పనులు చేయకపోవడంతో స్వచ్ఛమైన నీరు సరఫరా కావడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా సాగడం లేదని, మురుగు, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్పిడికి నిధులు మంజూరైనా గుత్తేదారుడు సక్రమంగా పనిచేయడం లేదని కమిషనర్ సమాధానమివ్వడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని గుత్తేదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

● ఇటీవల కురిసిన వర్షాలకు అందేవారి బోదె పరిసర ప్రాంతాల్లో తూరలు తొలగించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. తాత్కాలిక పనులతో కాలక్షేపం చేయకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వీరవాసరం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని వీరవాసరం ఎస్ఎంబీటీపీవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వలవల నరసింహారావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నినదించారు. ఎన్ఎస్ఎస్ అధికారి వి. దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అజ్జమూరు (ఆకివీడు), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అజ్జమూరు ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో సోమవారం వివిధ రకాల మొక్కలు నాటారు. విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.



వీరవాసరం: అవగాహన ప్రదర్శనలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మడుగుపోలవరం (వీరవాసరం), న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలో ప్రాధాన్య క్రమంలో దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. వీరవాసరం మండలం మడుగుపోలవరం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.39 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓహెచ్ ఎస్ఆర్, పైపులైన్ల విస్తరణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడుగుపోలవరం లేఅవుట్‌లో రహదారుల నిర్మాణానికి, నవుడూరు-మడుగుపోలవరంలంక ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అనంతరం ఇటీవల అవయవదానం చేసిన పోలిశెట్టి రేవంత్ శ్రీమురహరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి బోణం వెంకట పరమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అంగర కుటుంబరావు, యాళ్లండి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదుతో ప్రయోజనాలు



పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి తదితరులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ- పంట నమోదు చేయించుకోవాలని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. భీమవరం మండలం కొవ్వాడఅన్నవరం గ్రామంలో వరి చేలను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ- పంట నమోదు ప్రక్రియ ఎలా చేశారనే అంశంపై క్షేత్ర పరిశీలన చేసేందుకు వచ్చిన ఆమె అక్కడి పరిస్థితులను స్వయంగా తనిఖీ చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర చేలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్. వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే అవస్థలే..!



మత్స్యపురి (వీరవాసరం), న్యూస్‌టుడే: వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో అంతర్గత రహదారిపై ఇలా మురుగు నిలిచిపోయింది. చిన్నపాటి వర్షం పడినా ఈ గ్రామంలో రహదారులను వెతుక్కుంటూ వెళ్లాల్సిందే. నివాసాల మధ్య రోజుల తరబడి మురుగు నిలిచిపోతోంది. పక్కనే గొంతేరు డ్రెయిన్ ఉన్నా వాననీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి బి. శ్రీనివాసరావు స్పందిస్తూ పాలకవర్గంతో చర్చించి నిధుల లభ్యతను బట్టి అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లపు జాగా.. మురుగు పాగా



మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మహదేవపట్నం గ్రామ పరిధి ఉత్తరపాలెంలో గత ప్రభుత్వ హయాంలో పేదల గృహాలకు కేటాయించిన స్థలం ఇది. పల్లపు ప్రాంతంలోనే 51 మందికి స్థలాలిచ్చారు. 49 మందికి ఇళ్లు మంజూరు చేశారు. మట్టి పూడిక, రహదారుల పనులకు అప్పట్లో గుత్తేదారులు ముందుకు రాలేదు. వర్షాలకు ఆ ప్రాంతంలో నీరు నిలిచి నాచు పట్టి ఇలా తయారైంది. కొందరు నిర్మాణాలు చేపట్టినా సదుపాయాల లేమి కారణంగా మధ్యలోనే నిలిపేశారు. ఈ అంశంపై గృహ నిర్మాణ సంస్థ డీఈఈ శివరామరాజు స్పందిస్తూ గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో ఆ లేఅవుట్లో పూడిక పనులు జరగలేదని.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛత



సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కరరావు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అక్టోబరు 2న విజయవంతం చేయాలని డీఆర్వో ఉదయభాస్కరరావు కోరారు. ఈ అంశంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. అందరి భాగస్వామ్యంతోనే సంపూర్ణ స్వచ్ఛత సాధ్యమన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమ నిర్వహణకు భీమవరంలోని డీమార్ట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులతో అతిథులు, నిర్వాహకులు

గునుపూడి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం హన్మకొండలో సెప్టెంబరు 29న జరిగిన ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి ఏడు పతకాలు సాధించినట్లు శిక్షకుడు కరణం రాము తెలిపారు. కరణం శ్రీదివ్యతేజ, ఉల్లింగల రూపేష్ కోటేశ్వరరాజు, జనపరెడ్డి జశ్వంత్ సుబ్రహ్మణ్య మణికంఠ, నిల్లా రోహిత్‌నాగసాయి, బిట్ర జెసీక, ద్వారం రమ్యశ్రీ, అనంతపల్లి నాగ శివవినయ్‌లు వివిధ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు.

గరుడ హ్యాకథాన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ, అధ్యాపకులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గరుడ ఇండియన్ హ్యాకథాన్‌ను సోమవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. అనంతర ప్రతిభ చూపిన విద్యార్థులకు రెండోపట్టణ సీఐ జి.కాళీచరణ్, ప్రధానాచార్యుడు ఎం.వేణు, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం 7వ వార్డు పరిధిలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని పట్టణానికి చెందిన మణికంఠగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రహదారి ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం వేండ్రలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న కళాశాల బస్సు, కారు ఢీకొట్టుకున్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై ఎన్.హరిబాబు కథనం ప్రకారం.. పెనుగొండకు చెందిన పిప్పర వెంకటసత్యనారాయణ కుటుంబ సభ్యులు సోమవారం కారులో చినఅమిరం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా వేండ్ర సమీపాన మలుపులో ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన భార్య, కుమారుడు, కోడలు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఏదైనా సాధించగలమనే విశ్వాసం, ధైర్యం విద్యార్థుల్లో ఉండాలని చిన్మయి మిషన్(దిల్లీ) ఆచార్యులు చిద్రుపానంద స్వామీజీ అన్నారు. భీమవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో పది, పన్నెండుల తరగతుల విద్యార్థులనుద్దేశించి ఆయన సోమవారం మాట్లాడారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

శ్మశాన వాటికల ఆక్రమణలతో అవస్థలు

గునుపూడి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రాంతాల్లో దళితుల శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురికావడంతో అవస్థలు తప్పడం లేదన్నారు.

మండల పరిషత్తు సమావేశం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. సభ్యులు, సర్పంచులు పలు అంశాలపై చర్చించారు.

అవి ఇవి అన్నీ

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

పెదకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించేవారికి మంచి గుర్తింపు ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఆకివీడు మండలం పెదకాపవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బందెల శ్రీకాళహస్తీశ్వరుడు ఉద్యోగ విరమణ అభినందన సభను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఓఎస్డీ కఠారి వెంకటకృష్ణ, సమగ్రశిక్షా ఏపీసీ శ్యామ్, డీసీఈబీ కార్యదర్శి జేడీవీ శ్రీనివాస్, ఎంఈవో ఎ. రవీంద్ర, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచి ఊసల బేబీ స్నేతు తదితరులు పాల్గొని ఆయనను సత్కరించారు.

ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఏజెంట్లను నమ్మి విదేశాలకు వెళ్లవద్దని కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గల్ఫ్ హెల్ప్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాలమూరుకు చెందిన కొలుసు కృపామణి జీవనోపాధికి ఒమన్ దేశానికి వెళ్లి అక్కడ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఆమెను స్వదేశానికి రప్పించాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు వినతి పత్రం అందజేశారు.

పోషకాహారంతో ఆరోగ్యం

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు విధిగా పోషకాహారం తీసుకొంటే అనారోగ్య సమస్యలు దరి చేరవని ఐసీడీఎస్ సీడీపీవో వాణీ విజయరత్నం సూచించారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా విస్సాకోడేరులో గర్భిణులకు సామూహికంగా సీమంతాలు నిర్వహించి చీరలు, పోషకాహార కిట్లు అందజేశారు. సర్పంచి బొల్లా శ్రీనివాస్, నాయకులు నడిపూడి అప్పారావు, సూపర్‌వైజరు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహికంగా సీమంతాలు చేశారు. సర్పంచి బందా విజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కె. సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, సీడీపీవో వాణీ విజయరత్నం పాల్గొని గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు.



విస్సాకోడేరులో సామూహికంగా సీమంతాలు

ప్రకటన

మా Client, పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, కొణితివాడ గ్రామ కాపురస్తులు చిక్కాల ప్రభాకర్ రావు (లేటు) గారి కుమారుడు ద్వితీయ సంతానం చిక్కాల గోపాలకృష్ణమూర్తి (గోపి) వారి కుమారుడు చిక్కాల వంశీ సాయి కల్కి ప్రభాకర్ మనువడు అయి ఉన్నందు వల్ల వారికి R.S.No. 411/1రు య. 1.06 సెంట్లు మధ్య గల య. 17 1/2 సెం॥ చిక్కాల గోపాలకృష్ణమూర్తి (గోపి)కిను date: 6-9-2007 లో య. 0.15 సెం॥ చిక్కాల వంశీ సాయి కల్కి ప్రభాకర్‌కిను date: 23-4-2005 అన్నందలి settlement deed ద్వారా ఆ ప్రతికి పల్లపు భూమి క్రింది ఉండి అందలి దానిని రావూరి దుర్గాభవాని W/o రావూరి చెల్లారావు తదితరులు అమ్ముటకు ప్రయత్నించు చున్నారు. వారికి అమ్ముటకు ఏ విధమైన హక్కు లేదు. కావున ఎవరైన ఈ ఆస్తిని కొనుగోలు చేసినచో చట్టరీత్యా చెల్లదు అని తెలియజేయుచున్నాము.

సం/- Swarna Kambala
కొణితివాడ Advocate, Narasapuram
30-09-2024 Ph No: 95538 45148

పండుటాకులకు అండగా..!

● స్ఫూర్తిదాయకంగా సేవా కార్యక్రమాలు
● నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు (పాతచిత్రం)

ఆకివీడు, న్యూస్‌టుడే: వృద్ధులకు అండగా నిలిచేలా పలు స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ సంఘాలు, క్లబ్ ప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆకివీడులో అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘాన్ని వైద్యుడు ఎంవీ సూర్యనారాయణరాజు 2012లో ప్రారంభించగా అప్పటి నుంచి వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలపై 102 అవగాహన సదుస్సులు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని వృద్ధులకు న్యాయం చేసేలా తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా నాలుగుసార్లు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలకు ఎంపికైంది.

● ఈ సంఘం ఆధ్వర్యంలో ఏటా 8 నుంచి 10 సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి సదస్సులో దాతల సహకారంతో 100 మందికి తగ్గకుండా దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. 200 మందికి ఊతకర్రలు, ఆరు సార్లు పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. అనేక మంది వృద్ధులకు పౌరసన్మానం చేశారు.

● ఈ ఏడాది ఆకివీడులోని లయన్స్ భవనంలో వృద్ధుల సంఘం, లయన్స్ క్లబ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేశారు. ఆకివీడు లయన్స్ మెడికల్ ట్రస్ట్ సహకారంతో రూ. 40 వేలు విలువైన మందులను వృద్ధులకు ఉచితంగా అందజేయనున్నారు. లక్ష్మీ ఆసుపత్రి వైద్యులు నవీన్, కవిత సౌజన్యంతో 120 మందికి దుప్పట్లు పంపి చేయడంతో పఆటు సమాజ సేవకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య తెలిపారు.

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పాఠశాలలకు అంతర్జాల రూటర్లు అందజేత

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అంతర్జాలం సౌకర్యం కల్పించే ప్రక్రియలో భాగంగా సిమ్ ఆధారిత రూటర్లను సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులకు అందజేశారు. రాబోయే రోజుల్లో ఆన్‌లైన్ తరగతులు, విద్యా పరమైన అంశాలను దృశ్య శ్రవణం ద్వారా చిన్నారులు వీక్షించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంలో వీటిని అందజేస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రామేశ్వరుడికి అభిషేకాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: నత్తారామేశ్వరంలోని శ్రీరామేశ్వరస్వామికి సోమవారం పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామేశ్వరపు రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


పెనుగొండలో సామూహిక సీమంతాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: నిత్యం పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని తెలిపారు. సోమవారం పోష్టికాహార మాసోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక రైతు భరోసా కేంద్రంలో శ్యామలాసోని గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పెనుగొండ విభాగం పర్యవేక్షకురాలు ఎం.విజయకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

స్పందించారు.. మార్చారు..



పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు గ్రామీణ పంచాయతీ నాగరాజుపేటలో విద్యుత్తు స్తంభం ఒరిగింది. పడితే ప్రమాదమే శీర్షికతో గత నెల 23న 'ఈనాడు'లో ప్రచురితమైంది. ఏఈ ఎల్.శ్రీనివాస్ స్పందించారు. ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.



దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక వీవర్స్ సామాజిక భవనంలో దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడు కూర్మా శివగణేష్, ప్రధాన కార్యదర్శి మానెం బసవరాజు, కోశాధికారి యర్రా శివాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్య, వైద్యపరంగా వెనుకబడిన దేవాంగులకు సహాయ సహకారాలు అందిస్తామని నూతన సభ్యులు తెలిపారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం..!

ప్రమాదాలకు కేంద్రంగా రహదారి మలుపులు


రాష్ట్ర రహదారిలో వెలగలేరు వద్ద..

పెనుమంట్ర, న్యూస్‌టుడే

నిత్యం ఎంతో మంది రాకపోకలు సాగించే రహదారులు ప్రయాణికుల పాలిట ప్రాణసంకటంగా మారాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన దారులను నిర్వహణ చేయకపోవడం... ఆక్రమణలు పట్టించుకోకపోవడం.. మలుపుల వద్ద విస్తరణ చేయకపోవడం.. హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం.. వెరసి తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మార్టేరు-పెంటపాడు ఆర్అండ్‌బీ రహదారిలో మార్టేరు నుంచి నత్తారామేశ్వరం వరకు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రహదారి వెంబడి ఆక్రమణలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి.

కనీసం హెచ్చరిక బోర్డులు లేవు..

ప్రమాదకర ప్రదేశాలు, మలుపుల వద్ద అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. మార్టేరు-పెంటపాడు మార్గంలో మార్టేరు నుంచి నత్తారామేశ్వరం వరకు 8 మలుపులు ఉండగా వీటిలో 6 అత్యంత ప్రమాదకరంగా మారాయి. వెలగలేరు, ఆలమూరు, పెనుమంట్రల్లో బోర్డులు లేవు. మలుపుల వద్ద రహదారి విస్తరణ చేయకపోవడం కూడా సమస్యగా ఉంది. రహదారి అంచుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఈ పరిస్థితిపై ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వేగ నిరోధకాల ఏర్పాటుకు ఆలోచన చేస్తామని చెప్పారు.


నెలమూరులో రహదారిని ఆవరించిన పిచ్చి మొక్కలు


సోమరాజు ఇల్లింద్రపర్రు మలుపులో రోడ్డు అంచు ఇలా..

ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలు

- నత్తారామేశ్వరంలోని మూడు రోడ్ల కూడలిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ వాహన వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరినా అధికారుల నుంచి స్పందన కరవైంది.
- మార్టేరు - వెలగలేరు మలుపు వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి ఇరుకుగా ఉండటం, వాహనాల నియంత్రణ లేకపోవడం సమస్యగా మారింది.
- నెలమూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, జుత్తిగ, నత్తారామేశ్వరం గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి.
- మార్టేరు-నత్తారామేశ్వరం మార్గంలో రోజు రోజుకీ ఆక్రమణలు పెరుగుతున్నాయి. రహదారికి చేర్చి నిర్మాణాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారి అంచు అంతా ఆక్రమణల పర్వం కావడంతో వాహనాల రాకపోకల సందర్భంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయి.
- పెనుమంట్రలోని మూడు మలుపుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనచోదకులు ముందుకు సాగుతున్నారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం ఆర్డీవోగా దాసిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎం.అచ్యుత్‌అంబరీశ్ ఏలూరు బదిలీపై వెళ్లారు. ఉయ్యూరు నుంచి దాసిరాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. దాసిరాజు పుట్టిన రోజు, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కుష్ఠు రోగుల కాలనీలో పుట్టిన రోజు.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం ఆర్డీవోగా దాసి రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తన పుట్టిన రోజును రుస్తుంబాదలోని కుష్ఠు రోగుల కాలనీలో చేసుకున్నారు. ఈ సందర్భంగా కేకు కోసి అందరికీ పంచారు. తన పుట్టిన రోజును కాలనీ వాసుల మధ్యలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో కాలనీ వాసులకు అన్నదానం చేసి స్వయంగా వడ్డించారు.

ఎక్సైజ్ శాఖ సీఐగా రాంబాబు



నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం ఎక్సైజ్‌శాఖ సీఐగా ఎస్.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాంబాబు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

వైకాపాకు వార్డు కౌన్సిలర్ రాజీనామా

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం వైకాపాకు చెందిన 39వ వార్డు కౌన్సిలర్ కేసరి గంగరాజు సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. 2004 నుంచి వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు ఆయన అనుచరుడిగా ఉన్నారు. తన వ్యక్తిగత కారణాలతో వైకాపాకు రాజీనామా చేస్తున్నట్లు తెలియజేస్తూ లేఖను ఆయన ప్రసాదరాజుకు పంపించారు. వైకాపాకు చెందిన పలువురు కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కూటమిలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతుంది. ఇంకా పలువురు కౌన్సిలర్లు వైకాపాకు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కళాకారులు సమాజ సేవకులు


ఉదయభాస్కర్‌ను సత్కరించిన నాయకులు

యలమంచిలి, న్యూస్‌టుడే: కళాకారులంటే సమాజ హితం కోరి మార్పుకోసం ప్రయత్నించే సేవకులని పెదలంక సర్పంచి తాళ్ల నాగరాజు అన్నారు. కొంతేరుకు చెందిన గుమ్ముళూరి ఉదయభాస్కర్ రంగస్థల నటుడిగా పాత్రికేయుడిగా 30ఏళ్లుగా పైబడి సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈసే ఆవార్డులు సొంతం చేసుకున్న ఉదయభాస్కర్ అభినందనీయుడని పలువురు కూటమి నాయకులు అన్నారు. ఉదయభాస్కర్‌ను సత్కరించారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని మణుగుల మేఘ వర్షిత జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మూడో స్థానం సంపాదించింది. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమం పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీల్లో వర్షిత ప్రతిభ చూపి విజేతగా నిలవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ప్రతి ఒక్కరి సహకారంతోనే స్వచ్ఛత


నరసాపురం: గోదావరి తీరంలో శుభ్రం చేస్తున్న సతీశ్, ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు



ఆచంట ఆసుపత్రి పరిసరాలు శుభ్రం చేస్తున్న వైద్యులు

నరసాపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకల సతీశ్ అన్నారు. నరసాపురం పట్టణంలోని వశిష్ఠ గోదావరి తీరంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సోమవారం విద్యార్థులు తొలగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సతీశ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా పెన్నాడలోని భీమవరం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గోదావరి రేవులు, ఇతర ప్రాంతాల్లో చెత్త తొలగించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: స్వచ్ఛ వడలికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ గ్రామ సర్పంచి కాసాని విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఆమె, పంచాయతీ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శన చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. పంచాయతీ కార్యదర్శి పి.అచ్యుతరామకృష్ణ స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు.

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట సామాజిక వైద్య కేంద్రం పరిసరాలను సోమవారం వైద్య సిబ్బంది శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రోగులకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పెనుమదం సొసైటీ మహాజన సభ

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదం సొసైటీ మహాజన సభ సొసైటీ ప్రత్యేకాధికారి పి.విజయశ్రీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ పరిధిలో గడువు మీరిన రుణ బకాయి రూ.1.27 కోట్లు ఉందన్నారు. వ్యవసాయ రుణాల కింద ఈ మొత్తాన్ని 288 మంది రైతులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కారణంగా సకాలంలో రుణాలు చెల్లించే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బకాయి ఉన్న రైతులను సిబ్బంది కలిసి వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించి ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి తానేటి బాబూరావు, నాయకులు మానేపల్లి శ్రీధర్, పెన్మెత్స రామభద్రరాజు, నిట్టల భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం అర్బన్ సొసైటీ మహాజన సభ సోమవారం నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ ద్వారా హేమకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి జరుగుమిల్లి శ్రీనివాసరావు వార్షిక నివేదిక చదివి వినిపించారు.

సీఐటీయూ నాయకుల గృహ నిర్బంధం

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఉండి మండలం కాళ్లలో అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదంపై నిరసన వ్యక్తం చేయడానికి వెళ్తున్న సీఐటీయూ నాయకులను పట్టణ పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ నివాసం వద్ద ఆయనను పోలీసులు నిర్బంధించారు.

మెప్మా సీవోపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీతో అసభ్యకరంగా ప్రవర్తించిన సీవోపై సోమవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. యూనియన్ బ్యాంకు నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల్లో అవకతవకలు జరిగాయని దీనిపై మాట్లాడాలని సీవో సత్యనారాయణ ఈ నెల 28న ఆర్పీ బొబ్బిలి దుర్గాభవానీని పట్టణంలోని కరుణ ఇంటికి పిలిచారు. ఆ సమయంలో సత్యనారాయణ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దుర్గాభవాని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తనపై దాడి చేశారంటూ..

నరసాపురం, న్యూస్‌టుడే: మెప్మా సీవోపై దాడికి పాల్పడిన 11 మందిపై సోమవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు. ఎస్సై కథనం మేరకు బ్యాంకు నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యుల పేరుతో తీసుకున్న రూ.18.50 లక్షలు పక్కదారి పట్టించారు. దీనిపై ఆ రుణం నగదు తిరిగి చెల్లించాలని ఈ నెల 27న సూచించారు. దీనిపై మాట్లాడాలని 2వ వార్డు చలువపేటలోని అంబేడ్కర్ భవనం వద్దకు పిలిచారు. అక్కడ బొబ్బిలి దుర్గాభవాని, ఆమె భర్త బొబ్బిలి ఆనంద్, పిన్నిటి మహేష్, మీసాల మణికంఠ, పిట్టా నరేష్, మరో ఆరుగురు కొట్టి గాయపరిచారు. దీనిపై సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: కాపవరంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. దీనిపై అగ్నిమాపక అధికారి వై.వి.జానకిరామ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు పెంద్ర పెద్ద మహాలక్ష్మీ ఇంట్లో దీపం ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని చెప్పారు. రూ.రెండు లక్షలు ఆస్తి నష్టం ఉంటుందన్నారు. బాధితులు మాత్రం ఇంట్లో రూ.50 వేలు, 10 తులాలు వెండి, ఉందని చెబుతున్నారు. ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

స్పందిస్తారని.. వచ్చాం..!

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో బాధితుల మొర

అనుమతి లేకుండా నిర్మాణం



ఆవాసాల సమీపంలో ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా చర్చి నిర్మాణం చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలి. **- కడియం గంగాభవాని, మొగల్తూరు**

శిక్షణ ఇవ్వకుండానే..



నేను పీఎం విశ్వకర్మయోజన పథకంలో శిక్షణకు దరఖాస్తు చేసుకున్నా. మా గ్రామంలో డిజిటల్ భవనం ఉంది. కాని నాకు అక్కడ కేటాయించకుండా నవరసపురం శిక్షణ కేంద్రంలో కేటాయించారు. దీనిపై అధికారులకు వినతిపత్రం అందించి మా గ్రామంలోనే కేటాయించాలని కోరా. ఆ ప్రక్రియ పూర్తికాలేదు. కాని నాకు నవరసపురంలో శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం జారీచేసినట్లు అంతర్జాలంలో చూపుతుంది. దీనిపై అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించలేదు. **- రామాని రాజేశ్వరి, పీయంలంక**

భార్యగా వేరొకరిపేరు..



నా భర్త చిన్న ఇటీవల మృతి చెందారు. ఆయన మరణ ధ్రువపత్రంపై వేరే మహిళ పేరు నమోదు చేశారు. మా ఇద్దరు పిల్లలను చదివిస్తున్నా. వారి విద్యా ప్రవేశాలు, ఇతర అవసరాలకు ఆ మరణ ధ్రువపత్రం వినియోగించుకునే వీలులేదు. దాన్ని సరిచేయించి నా సమస్య పరిష్కరించాలి. **- సిద్దిరెడ్డి ఆదిలక్ష్మి, నరసాపురం**

రుస్తుంబాద (నరసాపురం), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. దీంతో డివిజన్ స్థాయి అధికారులైనా కరుణిస్తారని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చిన పలువురు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

నిధులు విడుదల చేయలేదు



మా గ్రామంలోని పార్వతి మల్లేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.4.15 లక్షలు మంజూరు చేసింది. ఆలయ నిర్మాణం పూర్తిచేశాం. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు కొలతల పుస్తకంలో వివరాలు నమోదు చేశారు. దేవాదాయశాఖ అధికారులు నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించలేదు. కొలతల పుస్తకం కనబడటం లేదంటున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని బిల్లులు చెల్లించాలి. **- ఇనుకొండ వెంకటబ్రహ్మాజి, ఏనుగువానిలంక**

సొంత స్థలంలో దారి..



మాకు కాజపడమరలో జిరాయితీ భూమి ఉంది. సమీపంలోని రైతులు దౌర్జన్యంగా ఆ భూమి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిపై విచారణ చేసి అధికారులు మాకు న్యాయం చేయాలి. **- చాగంటి అమ్మిరాజు, లక్ష్మణేశ్వరం**

వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఆర్డీవో దాసి రాజు సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో వచ్చిన వినతుల పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు నివేదించాలని కార్యాలయ సిబ్బందిని ఆర్డీవో ఆదేశించారు. మొత్తం 27 మంది వినతులు అందించారని కార్యాలయ జూనియర్ అసిస్టెంటు సురేఖ తెలిపారు.

వైభవంగా గొంతెనమ్మ జాతర


నంది విగ్రహాన్ని దర్శించుకుంటున్న కొత్తపల్లి తదితరులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంనార్తు తెన్నేటిపేటలో సోమవారం గొంతెనమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గత యాభైఏళ్లుగా ఈ గ్రామంలో గొంతెనమ్మ జాతర నిర్వహిస్తున్నారు. వైకాపా అయిదేళ్లపాలనలో ఈ జాతర నిలిచిపోయింది. సమరసత సేవా ఫౌండేషన్, సర్పంచి పేరుపాలెం వెంకన్న, ఆర్ఎస్ఎస్ సేవక్‌ల ఆధ్వర్యంలో సమస్య పరిష్కరించారు. దీంతో తిరిగి జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా మట్టితో నంది రూపొందించి గ్రామోత్సవం చేశారు. అనంతరం మేళంవారిపాలెం చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి చిన్న, మాజీ సర్పంచి మేళం బన్ను తదితరులు నంది విగ్రహాన్ని సందర్శించి పూజలు చేశారు.

వివిధ శాఖల్లో బదిలీలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 8మంది వీఆర్వోలు బదిలీ అయ్యారు. మార్టేరు వీఆర్వోలు జీవీ.ముత్యాలు, డి.చిన్నా వెల్పూరు-2, సిద్ధాంతం-2 గ్రామాలకు, పెనుమంట్ర వీఆర్వో కె.రాజు ఆలమూరుకు, ఆలమూరు వీఆర్వో ఆర్.శ్రీనివాస్ నత్తారామేశ్వరం, నెగ్గిపూడి వీఆర్వో ఏవీ.రామలక్ష్మి పైడిపర్రు, జుత్తిగ వీఆర్వో వి.వెంకటేశ్వరరావు సిద్ధాంతం-1, భట్లమగుటూరు వీఆర్వో జి.నాగేశ్వరి దొంగరావిపాలెం, పొలమూరు వీఆర్వో డి.శ్రీనివాస్ పాలకొల్లు పెదపేటకు బదిలీ అయ్యారు.

అయిదుగురు బిల్లు కలెక్టర్లు.. మార్టేరు, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న అయిదుగురు జూనియర్ అసిస్టెంట్స్ కమ్ బిల్లు కలెక్టర్లు బదిలీ అయ్యారు. జుత్తిగ నుంచి వీకె.కుమారి మల్లిపూడికి, ఆలమూరులో నుంచి జి.కావ్యశ్రీ మార్టేరుకు, మార్టేరు నుంచి బి.రాంబాబు ఆచంట మండలం కొడమంచిలి, నెగ్గిపూడి నుంచి జి.గోవిందరావు అత్తిలికి, మల్లిపూడి నుంచి ఎంఎస్.సుబ్బలక్ష్మి జుత్తిగ గ్రామానికి బదిలీ చేశారు.

పెనుమంట్ర ఈవోపీఆర్డీ.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర ఈవోపీఆర్డీ పీవీవీఎస్.రాంప్రసాద్ తణుకు మండలానికి బదిలీ అయ్యారు. ఈయన ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఎంపీడీవో వ్యవహరిస్తున్నారు. ఇటు ఎంపీడీవో, అటు ఈవోపీఆర్డీ పోస్టులు ఖాళీ కావడంతో పరిపాలన పరమైన అంశాలపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా గ్రామాల్లో పరిస్థితులపై పర్యవేక్షణ కొరవడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆచంటకు కొత్త సబ్‌రిజిస్ట్రార్.. ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట సబ్‌రిజిస్ట్రార్‌గా సోమవారం కె.వెంకటపతిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెనుగొండ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన కమలకుమారి వీరవాసరం బదిలీ అయ్యారు.

ఏఎన్ఎంలు వైద్యాధికారుల పర్యవేక్షణలోకి..

మొగల్తూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల పర్యవేక్షణ బాధ్యతలను వైద్యాధికారుల పరిధిలోకి తీసుకొస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. వారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

శివయ్యకు పంచామృతాభిషేకాలు



భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భాద్రపద మాస శివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామిని వివిధ రకాల పుష్పాలు, దీపాలంతో నేత్రపర్వంగా అలంకరించి సహస్ర నామ పూజలు చేశారు. పార్వతీదేవి, అన్నపూర్ణమ్మవార్లకు సహస్ర నామ కుంకుమార్చనలను ప్రధానార్చకులు రామకృష్ణ, సోంబాబు పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ


పెనుగొండ, న్యూస్‌టుడే: వడలి పంచాయతీ కార్యాలయంలో సోమవారం వడలి సర్పంచి కాసాని విజయలక్ష్మి ఎలుకల నివారణ మందు రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పొలాల్లో ఎలుకల నిర్మూలనకు రైతులు సామూహికంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వై.వర్మ, ఎస్.ఎన్ సూర్యప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అధిక దిగుబడికి పాటించాల్సిన విధానాలు, రైతులు అధిక ఎరువుల వినియోగాన్ని నివారించాలని వివరించారు.

రోడ్డుపై వాహనాలు.. రాకపోకలకు అడ్డంకులు



పాలకొల్లు, మార్కెట్, న్యూస్‌టుడే: అసలే ఇరుకు రహదారులలో ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాస్త విశాలంగా ఉన్న రోడ్లపై కూడా ప్రైవేటు వాహనాల పార్కింగ్‌లకు ఉపయోగిస్తున్నారు. పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ రహదారిలో ఇరువైపుల ప్రైవేటు బస్సులు, వ్యాన్‌లు ఇతర వాహనాలను ఎంతో కాలంగా నిలిపి ఉంచుతున్నారు. ఈ రహదారి గుండా ప్రతి రోజు వివిధ పాఠశాలల బస్సులు, లారీలు, కారులు, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటారు. వచ్చి పోయే వాహనాలతో రద్దీగా ఉండే మార్గంలో వాహనాలు నిలిపి ఉండటంతో ఇబ్బందిగా ఉంటుందని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా లేసు అల్లికల భవనం



నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కొప్పర్రు గ్రామ సచివాలయం-1 సమీపంలోని అలంకృతి లేసు అల్లికల భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 2016 సంవత్సరంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు భవనాన్ని ప్రారంభించారు. తర్వాత కొన్నాళ్ల పాటు భవనంలో మహిళలకు లేసు అల్లికలు, టైలరింగ్ శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వైకాపా అయిదేళ్ల పాలనలో లేసు అల్లికలు, టైలరింగ్ శిక్షణలు పూర్తిగా విస్మరించడంతో ప్రస్తుతం భవనం శిథిలస్థితికి చేరుకుని నిరుపయోగంగా దర్శనమిస్తోంది. అలంకృతి లేసు అల్లికల భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదేశించినా.. అమలు కావడం లేదు



పేరు మారని వెలగలేరు ఆర్బీకే

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న బోర్డులను సైతం తొలగించాలని ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాని క్షేత్రస్థాయిలో ఆ దిశగా యంత్రాంగం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో అవి ఇప్పటికీ అలానే దర్శనమిస్తున్నాయి. పెనుమంట్ర మండలం వెలగలేరు రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా అధికారులు నేటికీ పేరు మార్చలేదు. రాష్ట్ర రహదారి చెంతన ఉన్న ఈ భవనం బోర్డును చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నేటికీ ఇదే పరిస్థితి ఉండటం గమనార్హం. కొన్ని చోట్ల మాజీ సీఎం చిత్రాలు సైతం కనిపిస్తున్నాయి. **- మార్టేరు, న్యూస్‌టుడే**

పవన్ దీక్షకు మద్దతుగా దీపారాధన

మార్టేరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయమై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన 11 రోజుల ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా నెలమూరు రామాలయంలో సోమవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

వినతుల స్వీకరణ


కార్యక్రమంలో కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక పురపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, టిడ్కో గృహాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా బాణసంచా కలిగి ఉంటే కఠిన చర్యలు


సూచనలు చేస్తున్న తహసీల్దార్ వంశీ

అత్తిలి గ్రామీణం , న్యూస్‌టుడే : అత్తిలి మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా సామగ్రి కలిగి ఉన్నా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తప్పవని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. అత్తిలి మండలంలో బాణసంచా సామగ్రి అమ్మకాలు చేసేవారికి పలు సూచనలు చేశారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: ఈఎస్‌ఐ ఆసుపత్రి రోడ్డులో నీరు చేరి చెరువులా మారడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. **- సత్యనారాయణ, స్థానికుడు**

సమాధానం: రహదారిలో నీటిని తొలగించేలా చర్యలు చేపడతాం. **- సోమేశ్వరరావు , శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: మామిడి తోట గాంధీబొమ్మకు వెళ్లే రోడ్డులో చెత్త పేరుకుని రహదారి పైకి వస్తోంది **- ఆంజనేయులు, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు కూనాకరపేట పలువీధుల్లో డ్రెయిన్లు వ్యర్థాలతో మేట వేశాయి. **- వాసు, స్థానికుడు**

సమాధానం : డ్రెయిన్‌లను శుభ్రం చేయిస్తాం. **- తాడేపల్లి సూర్యకళ, సర్పంచి**


సమస్య : పెంటపాడు మండలం అలంపురంలోని 216ఏ జాతీయ రహదారి కూడలిలో గతంలో స్టాపర్లుగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డబ్బాలు పాడైపోయి రహదారికి దూరంగా పడి ఉన్నాయి. **- రాజు, స్థానికుడు**

సమాధానం : స్టాపర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- స్వామి, ఎస్సై**

నెరవేరని సొంతింటి కల

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

నగర, పట్టణాల్లో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో.. బంగారం కుదవ పెట్టి కొందరు, వడ్డీకి అప్పులు తెచ్చి మరి కొందరు నగదు చెల్లించారు. ఆ మేరకు ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగాయి. ప్రధాన మంత్రి ఎన్టీఆర్ అవాస యోజన పేరిట టిడ్కో ఇంటి నిర్మాణాలు చేపట్టి 60 శాతం పనులు పూర్తి చేశారు. తర్వాత వచ్చిన వైకాపా సర్కారు వీటిని పట్టించుకోకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామంటూ ఒక్కొక్క లబ్ధిదారుడి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించిన వైకాపా పాలకులు తర్వాత వారికి మొండి చేయి చూపింది.


తుప్పుపట్టిన ఊచలతో టిడ్కో నిర్మాణాలు

లబ్ధిదారులను రుణాల ఊబిలోకి నెట్టేసిన వైకాపా

దీంతో అప్పులకు ప్రతి నెలా వడ్డీ కట్టాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి...


పట్టణంలోని అజ్జరం పంత రోడ్డులోని రెండు చోట్ల బహుళ అంతస్తుల సముదాయాలు తరహాలో నిర్మాణాలు చేపట్టారు. అర్హులు ఎంపిక చేసి ఏ, బీ, సీ మూడు క్యాటగిరిల్లో విభజించారు. ఏ క్యాటగిరికి 144, బి క్యాటగిరికి 144, సి క్యాటగిరికి 625 ప్లాట్లు మంజూరు చేశారు. వీటిని పూర్తి చేయడానికి బ్యాంకుల నుంచి మంజూరు చేయించిన రుణాలు వైకాపా సర్కారు స్వాహా చేసిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. 'బ్యాంకర్ల నుంచి లబ్ధిదారులకు ఒత్తిడి పెరుగుతోంది. ఈ సొమ్ముల మళ్లింపుపై సీబీఐ విచారణ వేయాలి.' అని తెదేపా అధికార ప్రతినిధి తాతపూడి మారుతీరావు కోరారు.

లబ్ధిదారుల పరిస్థితి ఇది..

క్యాటగిరి	లబ్ధిదారులు	లబ్ధిదారులు వాటా రూ.లల్లో	మంజూరు చేయించిన రుణం (ఒక్కొక్కరికి)
300 ఎస్ఎఫ్‌టి	144	72,000	0
365 ఎస్ఎఫ్‌టి	144	37,12,500	3,15,000
430 ఎస్ఎఫ్‌టి	625	3,23,25,103	3,65,000


వృథాగా పడి ఉన్న పైపులైన్లు

ఎల్ల'వేళ'లా ఒకే సమయం..



తణుకు గ్రామీణ మండలం వేల్పూరులోని రుద్రేశ్వర, వీరభద్ర, మహాలక్ష్మీఅమ్మవారి ఆలయం సమీపంలో గడియారస్తంభం ఉంది. దీనికి నాలుగువైపులా గడియారాలున్నాయి. కొన్నేళ్లుగా పని చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీనిని బాగుచేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-ఈనాడు, తణుకు**

వరికంకులతో అలంకరణ..



సాధారణంగా రాజసౌధాల్లో, సుందరమైన లోగిళ్లలో గృహాలంకరణకు ఖరీదైన మెటల్, గ్లాస్ వాల్‌హ్యాంగర్లను అలంకరిస్తారు. వేల్పూరుకు చెందిన గన్నం పాపారావు వరికంకులతో అందమైన వాల్ హ్యాంగర్లను తయారు చేశారు. దీనిని స్థానిక బాలవినాయక ఆలయంలో అమర్చారు. ఆలయానికొచ్చిన భక్తులంతా దీనిని ఆసక్తిగా వీక్షిస్తున్నారు. **-ఈనాడు, తణుకు**

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న జనసైనికులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని దానమ్మ గుడి సమీపంలో ఇటీవల మృతి చెందిన పండు కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు అండగా నిలిచారు. సోమవారం మృతుని కుటుంబ సభ్యులను కలిసి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పైబోయిన వెంకటరామయ్య, చాపల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం దర్శిపర్రు సొసైటీ కార్యాలయంలో నాలుగేళ్లుగా జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద పర్సన్ ఇన్‌ఛార్జి కేవీ రామలక్ష్మి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా సొసైటీలో గత సంవత్సరం జరిగిన లావాదేవీలు, సంఘం పురోగతిపై చర్చించారు. దీనిలో భాగంగా సొసైటీ మాజీ అధ్యక్షుడు రుద్రా కాశీ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కార్యదర్శి దూలం శ్రీనివాస్, ఉపసర్పంచి కోలా మార్కండేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఆరిమిల్లి


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పైడిపర్రు జగనన్న కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో పైడిపర్రు కాలనీ వాసులు ఎమ్మెల్యే రాధాకృష్ణను కలిసి తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వాణిజాలకు అక్కినేని పురస్కారం అభినందనీయం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : మహా కవి తణుకులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వాణిజాల సరోజినీదేవికి అక్కినేని పురస్కారం దక్కడం హర్షనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి పురస్కరించుకుని గత నెల 27న హైదరాబాద్‌లో జీవీఆర్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అక్కినేని పురస్కార అవార్డు అందించారు. తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆమెను అభినందించారు.

నేటితో ముగియనున్న ఈ పంట నమోదు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సార్వా పంటకు సంబంధించి ఈక్రాప్ ప్రక్రియ మంగళవారంతో ముగుస్తుందని అత్తిలి వ్యవసాయాధికారి రాజేష్ చెప్పారు. ఈకేవైసీ నమోదు అయిన వారికి మాత్రమే పంట విక్రయం, నష్టపరిహారం, బీమా వర్తిస్తాయన్నారు.

సిఫార్సు బదిలీలు నిలిపేయండి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యాశాఖ మంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకొని విద్యాశాఖలో సిఫార్సు బదిలీలు చేపట్టవద్దని, ఉపాధ్యాయుల బదిలీలు చేసే కౌన్సెలింగ్ విధానంలోనే చేపట్టాలని ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి రాజగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దీక్షకు భాజపా సంఘీభావం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో నిర్వహిస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సోమవారం భాజపా నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పరమ పవిత్రంగా భావించే లడ్డూను వైకాపా ప్రభుత్వం అపవిత్రం చేసిందన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించడం బాధాకరమన్నారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ శ్రీదేవి, ఇరగవరం మండల అధ్యక్షులు పరుపూడి, తెదేపా నాయకులు బూరుగుపల్లి వెంకటరామరాజు, నరసింహారావు, ఎన్డీయే నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌కు మద్దతుగా జనసైనికులు.. తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వ్యవహారంలో జరిగిన అపచారానికి జనసేనాని పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు తాడేపల్లిగూడెం పట్టణ జనసైనికులు మద్దతుగా నిలిచారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. సురేష్, మధులత, చిన వెంకట్రామయ్య పాల్గొన్నారు.


తూర్పువిప్పర్రు: దీక్ష చేస్తున్న ఎన్డీయే నాయకులు

వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొండ్రుప్రోలు గ్రామంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

విద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రం అందుకుంటున్న విద్యార్థులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత నెల 23 నుంచి 27 వరకు ఒడిశాలో నిర్వహించిన 'ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్ క్యాంప్'లో శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్రహ్మణ్యం, శ్రీలత, మహేష్, అభిషేక్ విద్యార్థులు రైల్వే స్టేషన్ నావిగేషన్ అప్లికేషన్ పై ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి జాతీయ సదస్సుకు కేవలం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మాత్రమే ఎంపికైనట్లు చెప్పారు.

టైలర్ మల్లికార్జునరావు మృతికి సంతాపం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వేల్పూరులో ఇటీవల మృతి చెందిన సీనియర్ టైలర్ పెన్నాడ మల్లికార్జునరావు మృతి బాధాకరమని వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్ళ చిన వీరభద్రరావు అన్నారు. సోమవారం వేల్పూరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు మల్లేశ్వరరావు, నాగరాజు, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, నాగేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ లేవుట్లు

సర్కారు ఆదాయానికి గండి


తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంతోపాటు సమీప గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు ఇళ్ల స్థలాల కొరత సాకుగా చూపి, వ్యవసాయ భూములను స్థలాలుగా మార్చేసి విక్రయిస్తున్నారు. భూ బదలాయింపు (ల్యాండ్ కన్వెర్షన్) జరగకపోయినా నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తున్నారు. పట్టణానికి ఆనుకుని ఉన్న ప్రత్తిపాడు, పడాల, జట్లపాలెం, కుంచనపల్లి, పెదతాడేపల్లి, చినతాడేపల్లి, ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, పెంటపాడు తదితర గ్రామాల్లో అనధికార లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 200కు పైగా అనధికారిక అవుట్లు వెలిశాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ రూ.కోట్ల విలువైన భూముల క్రయ విక్రయాలకు అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లో నివాస గృహాలు ఏర్పడితే మౌలిక వసతులు కల్పించాల్సిన భారం ప్రభుత్వంపైనే పడుతోంది.

- కాలువలు, కల్వర్టులు, వంతెనలు, హైవోల్టేజీ విద్యుత్తు స్తంభాలు ఉన్న ప్రాంతాల్లో కూడా లేఅవుట్లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఇటు రహదారి వస్తుందని, అటు ప్రముఖ సంస్థలు వస్తున్నాయంటూ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మాయమాటలు చెప్పి సదరు స్థలాలు అంటగడుతున్నారు. వీటిని కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునే సందర్భంలో పంచాయతీకి, పురపాలక సంఘానికి 14 శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోంది.

- అక్రమ లే అవుట్లు వెలిసిన వెంటనే సంబంధిత మున్సిపల్, పంచాయతీ అధికారులు దృష్టి సారించి వెంచర్లలో పాతిన రాళ్లు ఎప్పటికప్పుడు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి, పంచాయతీలకు ఆదాయం సమకూరనుంది. జిల్లా స్థాయి అధికారులు మేల్కొని అక్రమ లే అవుట్లపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఉంది.


జట్లపాలెం రోడ్డులో పూడ్చిన పంట పొలం

'నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లను ఎప్పటికప్పుడు కట్టడి చేయిస్తున్నాం. రాళ్లను తొలగించి హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటాం.' అని తహసీల్దారు సునీల్ కుమార్ అన్నారు.



రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

ఇద్దరికి గాయాలు

పెంటపాడు, న్యూస్‌టుడే : లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదం పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని 216ఏ జాతీయ రహదారి కూడలిలో ఆదివారం రాత్రి జరిగింది. పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. బి.కొండేపాడుకు చెందిన బాలం గంగా మల్లేశ్వరరావు(30) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి గంగామల్లేశ్వరరావు, అతని స్నేహితులు గుబ్బల దినేశ్, బిల్లా చందుతో కలిసి ద్విచక్రవాహనంపై తాడేపల్లిగూడెం వెళ్తున్నారు. ప్రత్తిపాడులోని 216ఏ జాతీయ రహదారి కూడలిలోని మలుపు వద్దకొచ్చేసరికి ఏలూరు నుంచి ప్రత్తిపాడు బియ్యంలోడుతో వెళ్తున్న లారీ వారిని ఢీకొంది. ప్రమాదంలో గంగామల్లేశ్వరరావు తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని స్థానికులు 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై స్వామి వివరాలు సేకరిస్తున్నారు.

బావపై బావమరిది దాడి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య కోసం అత్తారింటికి వెళ్లిన భర్తను బావమరిది కొట్టి గాయపరిచిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతిపురానికి చెందిన రుష్మందరావుకు ఉరదాళ్లపాలెంలో ఉంటున్న రేవతితో గతేడాది డిసెంబరులో వివాహమైంది. గత నెల 29న ఉరదాళ్లపాలెంలోని అత్తారింటి వద్ద దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో రేవతి అన్న చోడిశెట్టి సత్యశివానంద సాయి రుష్మందరావును ఇటుకతో కొట్టి గాయపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ప్రదర్శన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై అవగాహన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ సుందరీబాయ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్స్ శ్యామలదేవి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ప్రజంటేషన్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు


చినతాడేపల్లి : పిచ్చిమొక్కలు తొలగిస్తున్న రవికుమార్ తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: చినతాడేపల్లిలోని ఎన్డీయే నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు రవికుమార్ జన్మదినోత్సవం పురస్కరించుకుని మంచినీటి చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించారు. అనీల్‌కుమార్, కృష్ణ, రామారావు, వెంకటేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు


వినతి పత్రం స్వీకరిస్తున్న మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఏజెంట్లను నమ్మి విదేశాలకు వెళ్లవద్దని కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో గల్ఫ్ హెల్ప్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాలమూరుకు చెందిన కొలుసు కృపామణి జీవనోపాధికి ఒమన్ దేశానికి వెళ్లి అక్కడ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఆమెను స్వదేశానికి రప్పించాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు వినతి పత్రం అందజేశారు. దీనిపై గట్టిం మాట్లాడుతూ వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సరైన పత్రాలు లేకుండా ఎంతో మంది విదేశాలకు వెళ్లి తిరిగి రాలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

పెంటపాడు, న్యూస్‌టుడే: గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడంవల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఉంటుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, తెదేపా మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అన్నారు. సోమవారం పెంటపాడు వెలమ యువజన సంఘం భవనం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకొని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిలపర్తి వెంకట్రావు మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్డీయే నాయకులు దాసరి అప్పన్న, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కసిరెడ్డి మధులత, ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గా భవానీ, సుజాత, విశాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం పోషకాహారం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జనసేన అత్తిలి మండల అధ్యక్షుడు దాసం ప్రసాద్ అన్నారు. అత్తిలి పంచాయతీ కార్యాలయంలో పోషకాహార మాసోత్సవం ఎన్డీయే నాయకుల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు సోమవారం నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఆదినారాయణ, గ్రామ తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరావు, శ్రీదేవి, తహసీల్దార్ దశిక వంశీ, సర్పంచి గంటా విజేత తదితరులు సీమంత వేడుకలో పాల్గొన్నారు. జనసేన అధ్యక్షుడు ప్రసాద్ ఆర్థిక సాయంతో 20 మంది గర్భిణులకు చీర, జాకెట్, పూలు, పండ్లు బహూకరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పెంటపాడులో గర్భిణులకు సీమంతాలు